సాక్షి
అనకాపల్లి
సోమవారం । 30 । డిసెంబర్ । 2024

అలల చెంతన అందెల సవ్వడి



అలల చెంతన అందెల సవ్వడి విశాఖ వాసులను ఓలలాడించింది. బీచ్‌రోడ్డులోని ఎంజీఎం పార్క్ వేదికగా ఇంటర్నేషనల్ ట్రెడిషనల్ డ్యాన్స్ కాంగ్రెస్-2024లో భాగంగా చివరి రోజు ఆదివారం 1,500 మందికి పైగా కూచిపూడి కళాకారులతో బ్రహ్మాంజలి-మహాబృంద నృత్యం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. 8లో

న్యూస్‌రీల్

యోగాలో ఆరేళ్ల చిన్నారి ఘనత



వరల్డ్ యోగ కప్ సాధించిన దైవజ్ఞ

చోడవరం: యూనివర్సల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖ రుషికొండ సాయిప్రియ రిసార్టులో ఆదివారం జరిగిన వరల్డ్ యోగా కప్ 2024 యోగా పోటీల్లో చోడవరం గ్రామానికి చెందిన ముత్యాల దైవజ్ఞ ప్రతిభ కనబరిచింది. ఈ చిన్నారి చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రం యోగా గురువు పుల్లేటి సతీష్ దగ్గర యోగా విద్యను అభ్యసిస్తున్న ఆరేళ్ల చిన్నారి ముత్యాల దైవజ్ఞ ప్రథమ స్థానం సాధించి యోగా కప్పు కైవసం చేసుకుంది. కాగా ఈ చిన్నారి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తుందని పలువురు ప్రశంసించారు. ఈ చిన్నారి మత్స్య ఆసనం, పద్మ సర్వాంగాసనం, గండబేరుండ ఆసనంలో మంచి ప్రతిభ కనపర్చి విజయం సాధించిందని సతీష్ తెలిపారు. ఈ దైవజ్ఞను ప్రపంచ యోగా విజేతగా తీర్చుదిద్దినందుకు గురువు సతీష్‌ని దైవజ్ఞ తల్లిదండ్రులు నవీన్‌కుమార్, రమ్య అభినందించారు. దైవజ్ఞ సాధించిన ఘనతను పతంజలి యోగా శిక్షణ కేంద్రం సభ్యులు, చోడవరం ప్రముఖులు కొనియాడారు.

ఉత్తమ కండక్టర్‌కు ఉపాధ్యాయుల సత్కారం



సీతారామరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం గ్రామ శివారు తెలకలదీపం గ్రామానికి చెందిన డెక్కల సీతారామరాజును పలువురు ఉపాధ్యాయులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల విశాఖలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాదరెడ్డి నుంచి ఉత్తమ ఆర్టీసీ కండక్టర్ అవార్డును పొందారు. వాల్తేరు డిపోలో 17 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఈయన విశాఖ - కొత్తకోట బస్సులో కండక్టరుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తకోట, అర్జాపురం, కళ్యాణలోవ, తదితర గ్రామాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమను విధులకు సకాలంలో గమ్యాన్ని చేర్చుతున్నందుకు కృతజ్ఞతగా రాజును బస్సులోనే శాలువతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి, నాగేశ్వరావు, జి.వి.ఆర్.రాజు, విద్యావతి, వాసవీలత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన మల్కాపురం మహిళా ఎస్‌ఐ కొట్యాడ దేముడమ్మ (ఫైల్)



స్టడీ సెంటర్ అనుమతుల మంజూరు కోసం లంచం తీసుకుని అవినీతి నిరోధకశాఖ అధికారులకు పట్టుబడిన ఓపెన్ స్కూల్ సొసైటీ అనకాపల్లి జిల్లా సమన్వయకర్త ఓ కుమార్(ఫైల్)

'డబ్బు మనిషిని మార్చదు.. అతడి నిజస్వరూపాన్ని బయటపెడుతుంది' -మహాత్మా గాంధీ

'మన సంపాదన మీదే ఆధారపడి జీవిస్తే ఆత్మగౌరవం పెరుగుతుంది' -మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్

'ప్రభుత్వ ఉద్యోగితో పని చేయించుకోవడం మన హక్కు. దాన్ని లంచంతో కొనొద్దు'.. ఇది ఓ సినిమాలోని డైలాగ్

కానీ ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా లంచం లేనిదే పని జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తుంటాయి. ప్రజలకు అవసరమైన పనులను చట్ట ప్రకారం చేయకుండా లంచం కోసం కొందరు అధికారులు ముప్పతిప్పలు పెడుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏసీబీకి పట్టుబడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను పరిశీలిస్తే అవినీతి పెరుగుతున్నట్టు స్పష్టమవుతోంది.

ఏ శాఖ చూసినా... షరా మామూలే!



ప్రభుత్వ కార్యాలయాల్లో లంచావతారులు

వివిధ ప్రభుత్వ శాఖల్లో కాసులివ్వనిదే కదలని దస్త్రాలు

- పలు కార్యాలయాల్లో పెచ్చుమీరిన అవినీతి
- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు
- ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఏసీబీ వలకు చిక్కిన 8 మంది ప్రభుత్వ ఉద్యోగులు

యలమంచిలి రూరల్: ముడుపులు...మామూళ్లు... ఆమ్యామ్యాలు....బల్ల కింద చేతులు...పేరేదైనా లంచం సర్వవ్యాప్తమైంది. కొన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో ప్రజలకు చట్టప్రకారం చేయాల్సిన పనులకు అధికారులు ధరలు నిర్ణయిస్తూ ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. లంచం ఇవ్వకుంటే ముప్పతిప్పలు పెడుతూ..మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు. లంచాలకు అలవాటు పడిన కొందరు అధికారులు మొత్తం ఆ శాఖకే మచ్చ తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని శాఖల్లో అధికారులు రోజువారీగా టార్గెట్ పెట్టుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. లంచావతారులు ఎందరో ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నా కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తగ్గడం లేదు. రెవెన్యూ, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, పోలీసు, సర్వే లాండ్ రికార్డ్స్, విద్యుత్...ఇలా ఏ శాఖలోనైనా ప్రజలకు ముడుపుల తిప్పలు తప్పడం లేదంటున్నారు.

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 3 నుంచి 4 శాతం ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల అవినీతి పైనే ఫిర్యాదులు అందుతున్నాయి. పనులు చేయడానికి లంచం తీసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగులు ఏసీబీకి పట్టుబడితే సంబంధిత పని సంగతి ఏమిటన్న సందేహం చాలా మందిలో ఉంటుంది. నిందితులను జైలుకు పంపిన తర్వాత అధికారులు బాధితుల పని త్వరగా పూర్తయ్యేలా దగ్గరుండి పర్యవేక్షిస్తారు. సంబంధిత అధికారుల వద్దకు తీసుకెళ్లి పనులు చేయిస్తుండడంతో బాధితుల కష్టాలు తొలగిపోతున్నాయి.

ఏడాదిలో 8 మందిపై అవినీతి కేసులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ ఏడాదిలో 8 మంది ప్రభుత్వ అధికారులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. వీరిలో ఏడుగురు అధికారులు సంబంధిత సేవల కోసం ఆయా వ్యక్తుల నుంచి లంచం సొమ్ము తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక అధికారిపై ఆదాయానికి మించి ఆస్తులు ఉండడంతో ఏసీబీ కేసు నమోదైంది.

నేరం రుజువైతే ఉద్యోగం పోయినట్టే..

ప్రభుత్వ ఉద్యోగులు చట్ట ప్రకారం చేయాల్సిన పనుల విషయంలో లంచం అడగడం..తీసుకోవడం నేరం. దీనిపై కేసు నమోదు చేస్తారు. లంచం తీసుకుంటూ దొరికిన ఉద్యోగులను ఏసీబీ అధికారులు 24 గంటల్లో ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తారు. చాలా వరకు బెయిల్ దొరకదు. సదరు ఉద్యోగికి కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తుంది. కోర్టులో నేరం రుజువైతే జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుంది. అవినీతి ఉద్యోగులు, అధికారుల ఆస్తులను కోర్టు స్వాధీనం చేసుకుంటుంది. నేరం రుజువు అయితే వాటిని ప్రభుత్వం జప్తు చేస్తుంది. లంచం తీసుకుంటూ పట్టుబడిన వారు జైలులో ఉండాల్సి వస్తుంది. వారిని ప్రభుత్వం సస్పెండ్ చేస్తుంది. పెండింగ్ విచారణ పేరుతో ఉద్యోగంలోకి తీసుకున్నా..కేసు పూర్తయ్యే వరకు ఇబ్బందులు తప్పవు. పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, ఇతర సౌకర్యాలు కోల్పోతారు. మానసిక వేదనకు గురి కావాల్సి వస్తుంది. సమాజంలో పలు అవమానాలకు గురి కావాల్సి వస్తుంది. చివరికి కోర్టులో నేరం రుజువైతే జైలు శిక్ష పడడంతో పాటు ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తారు.

ఏసీబీ వలలో ఇలా...



జీవీఎంసీ జోనల్ కమిషనర్ సింహాచలం ఇంట్లో ఏసీబీ సోదాలు (ఫైల్)

- ఈ ఏడాది సెప్టెంబరు 18న అనకాపల్లి జిల్లా విద్యాశాఖలో ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ జిల్లా సమన్వయకర్త ఓ కుమార్ కొత్త స్టడీ సెంటర్ మంజూరుకు సంబంధించి యలమంచిలికి చెందిన ఓ ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్ నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటూండగా కొండకొప్పాక డీఈవో కార్యాలయంలోనే ఏసీబీ అధికారులకు చిక్కారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 6న అనకాపల్లి మండలం గొలగాం గ్రామ పంచాయతీ కార్యదర్శి కొసిరెడ్డి కనకబాబు ఇంటి పన్ను మ్యుటేషన్, మదింపు కోసం తోట బాబ్జీ నుంచి రూ.7వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.
- ఈ ఏడాది మార్చి 4వ తేదీన నాతవరం మండలం గుమ్మిడిగొండ వీఆర్వో జుర్రా సింహాచలం, వీఆర్ఏ చేవల లోవరాజు భూమి మ్యుటేషన్ అడంగల్‌లో పేరు సవరణ దరఖాస్తు ఆమోదం పొందడానికి అడిగర్ల వంశీకృష్ణ నుంచి రూ.8వేలు లంచం తీసుకుంటూండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- ఈ ఏడాది మార్చి 14న విశాఖ నగరం ఆరిలోవ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ చౌదరి హరికృష్ణ ఓ వివాదం పరిష్కరించి, అనధికారికంగా సీజ్ చేసిన మొబైల్ ఫోన్‌ను తిరిగివ్వడానికి పిట్టా అప్పలరాజు నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటూండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- ఈ ఏడాది ఏప్రిల్ 18న ఓ ఇంటికి ఆస్తి పన్ను ఖరారు చేయడానికి ఓ వ్యక్తి నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటూ పెందుర్తి మండలం వలిమెరక గ్రామ పంచాయతీ ఏవో వద్దాది సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కొర్రా విక్టర్ ప్రవీణ్‌లు ఏసీబీ అధికారులకు చిక్కారు.
- ఈ ఏడాది ఆగస్టు 21వ తేదీన విశాఖ నగరం మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఓ క్రిమినల్ కేసులో షేక్ షాను, ఆమె స్నేహితురాలు ఇద్దర్నీ అరెస్ట్ చేయకుండా ఉండడానికి వారి వద్ద నుంచి మహిళా ఎస్‌ఐ కొట్యాడ దేముడమ్మ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారులకు పట్టుబడడం సంచలనం కలిగించింది.
- అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండల తహసీల్దార్ కార్యాలయంలో అదే మండలం భీమబోయినపాలెం గ్రామ పరిధిలో ఉన్న 7.015 ఎకరాల భూమి వివరాలను ఆర్.దేవుడమ్మ, ఆమె ఇద్దరి సోదరుల పేరున మ్యుటేషన్ చేయడానికి భీమబోయినపాలెం వీఆర్వో పరవాడ లక్ష్మణరావు, అతని బావమరిది శెట్టిపాలెంకు చెందిన తాడి కిరణ్ కుమార్ రూ.15వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారుల వలకు చిక్కారు.
- జీవీఎంసీ జోన్-2 జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారన్న అభియోగంతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ ఏడాది నవంబరు 26న నిందితుడికి సంబంధించి విశాఖపట్నం, హైదరాబాద్, శ్రీకాకుళంలో నివాస గృహాలు,ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. సుమారు రూ.2.48 కోట్ల మేర అక్రమాస్తులు కలిగి ఉన్నట్టు ఇప్పటి వరకు ఏసీబీ అధికారుల దర్యాప్తులో లెక్కతేలింది.


అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



ప్రభుత్వ ఉద్యోగితో పనిచేయించుకోవడం ప్రజల హక్కు అని తెలుసుకోవాలి. ప్రభుత్వ శాఖల్లో కానీ సంస్థల్లో కానీ అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత. అవినీతి రహిత సమాజం కోసం అటు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే అవినీతి నిర్మూలన సాధ్యమౌతుంది. అవినీతి పెరిగితే దేశ ప్రగతి కుంటుపడుతుంది. సమాజానికి అవినీతి పెద్ద శత్రువుగా అందరూ గుర్తించాలి. అవినీతి నిర్మూలన కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్లు అతికించాం. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే ఏసీబీని సంప్రదించాలి. అవినీతిపై 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు గానీ,9440440057 మొబైల్ నెంబర్‌కు గానీ ఫిర్యాదు చేయాలి. ప్రభుత్వ అధికారులు లేదా ఉద్యోగులు ఆదాయానికి మించి ఆస్తులున్నా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. ప్రభుత్వ కార్యాలయాల్లో తొందరగా పనులు చేయించుకోవాలనే ఉద్దేశంతో లంచం ఇవ్వడం..తీసుకోవడం రెండూ నేరమే.

-బీవీఎస్ నాగేశ్వరరావు, డీఎస్పీ, ఏసీబీ, విశాఖపట్నం

కూటమిలో కుర్చీలాట!



- సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలు
- నేడో రేపో ఉత్తర్వులు
- చైర్మన్ల పదవుల కోసం కూటమిలో సిగపట్లు
- జాబితాల తయారీలో నిమగ్నమైన ఎమ్మెల్యేలు

నక్కపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరుమాసాలైన తర్వాత గ్రామ, మండల స్థాయిలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. నూతన సంవత్సరం కానుకగా మండల గ్రామ స్థాయి చోటా నాయకులకు నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని ఎమ్మెల్యేల నుంచి తీవ్రమైన ఒత్తిళ్లు రావడంతో ప్రభుత్వం ఎట్టకేలకు పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌లను (ముగ్గురు డైరెక్టర్లు వీరిలో ఒకరు చైర్మన్ (పర్సన్ ఇన్‌చార్జ్) నియమించేందుకు అంగీకరించినట్లు భోగట్టా. ప్రతి పీఏసీఎస్‌కు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఎంపిక చేసి పంపాలని పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలు ముగ్గురు పేర్లతో కూడిన జాబితాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. జాబితాల తయారీ ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారిందన్న ప్రచారం జరుగుతోంది. పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమిస్తున్నారన్న ప్రచారం జరగడంతో కూటమిలో సిగపట్లు ప్రారంభమయ్యాయి. చైర్మన్ పదవులు తమకే కావాలంటూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల్లో ముఖ్యనాయకులు తమదైన శైలిలో పావులు కదుపుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 పీఏసీఎస్‌లున్నాయి. చివరగా వీటికి 2013లో ఎన్నికలు జరిగాయి.



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

2018తో వీటి పదవీకాలం ముగిసింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా పాలకవర్గాల స్థానంలో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేసింది. తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండేళ్ల పాటు కరోనా ఇబ్బందులు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో తలెత్తిన ఇబ్బందుల కారణంగా పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించకుండా త్రీమెన్ కమిటీలనే కొనసాగించింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పీఏసీఎస్‌లకు ప్రత్యేకాధికారులను నియమించింది. వీరి పదవీకాలం డిసెంబరు 6తో ముగిసింది. మరో ఆరు నెలల పాటు వీరి పదవీకాలాన్ని పొడిగించింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేల ఒత్తిడి మేరకు తాత్కాలికంగా ప్రతి మండలం నుంచి పదిమందికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చే పనిలో భాగంగా పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. న్యూ ఇయర్‌కానుకగా వీరికి డైరెక్టర్ పోస్టులు కట్టబెట్టనుంది.

పదవుల కోసం తీవ్ర పోటీ

ప్రతి నియోజకవర్గంలో సగటున 3 పీఏసీఎస్‌లు ఉంటాయి. ఒక్కో పీఏసీఎస్‌కు ముగ్గురు డైరెక్టర్లను (బీసీ, ఎస్సీ, ఓసీ) నియమిస్తారు. జిల్లాలో మొత్తం 294 డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తారు. వీరిలో ఒకరిని పర్సన్ ఇన్‌చార్జ్ (చైర్మన్)గా ఎన్నుకోవాల్సి ఉంటుంది. పీఏసీఎస్‌లతోపాటు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్, 15 మంది డైరెక్టర్లను భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన నియోజకవర్గానికి ఒక డైరెక్టర్ పదవి లభిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ పీఏసీఎస్ డైరెక్టర్, పర్సన్ ఇన్‌చార్జ్‌ల పదవులు, డీసీసీబీ డైరెక్టర్ పదవులను దక్కించుకునేందుకు టీడీపీ, జనసేన నుంచి తీవ్ర పోటీ నెలకొంది. ఎన్నో ఏళ్ల నుంచి పార్టీకి కష్టపడి పనిచేస్తున్న వారిని ఎంపిక చేయాలని తెలుగు తమ్ముళ్లు కోరుతున్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిందంటే జనసేన పార్టీ కారణమని ఈ దఫా నామినేటెడ్ పోస్టుల్లో తమకు సముచిత స్థానం కల్పించాలని జనసేన వర్గాలు కోరుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండడం, ఇక్కడ పొత్తు ఉండడం వల్ల మాకు కూడా అవకాశం కల్పించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

ఆశావహుల బేరసారాలు..

ఒక్కో మండలంలో మూడు పీఏసీఎస్‌లు ఉంటాయి. మూడు పార్టీలకు మూడు చైర్మన్ పదవులు, డైరెక్టరు పదవులను ఇవ్వాలన్న డిమాండ్ ఎక్కువగా ఉంది. మూడు పార్టీలను సమన్వయం చేసుకుని జాబితా తయారు చేయడం ఎమ్మెల్యేకు తలనొప్పిగా తయారయింది. ఇప్పటికే ఆశావహులు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. కొన్ని మండలాల్లో చైర్మన్ పదవికి బేరసారాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. చైర్మన్ పదవికి రూ.3 లక్షలు, డైరెక్టర్ పోస్టుకు రూ.లక్ష వరకు చెల్లించేలా ఒప్పందాలు జరుగుతున్నట్టు చెప్పుకుంటున్నారు. విశాఖ నగరానికి చుట్టుపక్కల ఉన్న మండలాల్లో అయితే చైర్మన్ పదవి కోసం రూ.5లక్షలు ఇవ్వడానికి కూడా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల అనుచరులు, బంధువులు ఆశావహులతో బేరసారాలు సాగిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

కలెక్టర్ గారూ.. మా ఊరు రండి..

- రోడ్డుకు తక్షణం ఫారెస్టు అనుమతులు ఇవ్వాలి
- చలిసింగం గిరిజనుల వినూత్న నిరసన
- గుర్రాలతో మూడు కిలోమీటర్ల ర్యాలీ



గుర్రాల మీద గ్యాస్ సిలిండర్ పెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

చోడవరం: రావిమతకం మండలం చీమలపాడు పంచాయతీ శివారు చలిసింగం గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆదివారం ఆ గ్రామ గిరిజనులు సీకాయపాడు గ్రామం వరకు మూడు కిలోమీటర్ల పొడవునా గుర్రాలతో ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని రావి కమతం మండలం, చీమలపాడు పంచాయతీ చలిసింగం రెవెన్యూ గ్రామంలో 110 గిరిజన కుటుంబాలకు చెందిన 380 మంది జనాభా కొండ శిఖర గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల ప్రతి మూడు కుటుంబాలకు ఒక గుర్రం చొప్పున పెంచుకుంటున్నారు. ఈ గ్రామానికి రేషన్ డిపో ఉంది. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కొండ దిగువన ఉన్న సీకాయపాడు గ్రామం వద్ద రేషన్ డిపోను ఏర్పాటు చేశారు. ఈ డిపో నుంచి గుర్రాల సహాయంతో రేషన్ సరుకులు చలిసింగం గ్రామానికి తెచ్చుకుంటున్నారు. ఈ గ్రామంలో ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉంది. ఈ గ్రామస్తులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించాలంటే కొత్తకోట సంతకు గుర్రాల సాయంతో తీసుకెళ్లాలి. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా డోలి కట్టి తీసుకెళ్లాల్సిందే. గ్రామానికి రహదారి నిర్మాణానికి 2018-19లో రూ.3 కోట్లు నిధులు మంజూరు చేశారు. అప్పట్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిధులు చెల్లుబాటు కాలేదు. కాగా 2023-24 లో సీకాయపాడు నుంచి చలిసింగం గ్రామం వరకు 3 కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్ల 65 లక్షలు నిధులు మంజూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఈ ఏడాది జనవరి 24 ఈ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రహదారి నిర్మాణానికి ఫారెస్టు అనుమతులు లేకపోవడంతో పాటు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు ప్రారంభించలేదు. నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు కావస్తున్నా సరే ఈ రోడ్డు నిర్మాణం ప్రారంభం కాలేదు. కలెక్టర్ డి.ఎల్.సి. సమావేశం ఏర్పాటు చేసి, ఫారెస్టు అనుమతులు ఇవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి తక్షణమే ఫారెస్టు అనుమతులు ఇప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సమస్యలపై వచ్చే ఏడాది జనవరి 8న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట డోలీలు, గుర్రాలతో ర్యాలీ నిర్వహించి కలెక్టరు దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ నిరసనలో ఏపీ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.గోవిందరావు, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు చీపురు శంకర్రావు పాల్గొన్నారు.

'ఖైదీలు జైలు నిబంధనలు పాటించాలి'



అవగాహన కల్పిస్తున్న విశాఖ జిల్లా న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, సీపీ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ(విశాఖ): జైలు నిబంధనలను ఖైదీలు తప్పనిసరిగా పాటించాలని విశాఖ జిల్లా సెషన్స్ జడ్జి ఆలపాటి గిరిధర్ తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని ఆదివారం జిల్లా న్యాయమూర్తితో పాటు విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు. జైల్లో శనివారం జరిగిన వార్డర్ల ఆందోళనపై ఆరా తీశారు. అనంతరం ఖైదీలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి, సీపీ మాట్లాడుతూ జైలు లోపలకి గంజాయి, మొబైల్ ఫోన్‌లు, బీడీలు తదితర నిషేధిత వస్తువులు తీసుకురావడం, వినియోగించడం చేయకూడదన్నారు. రౌడీ షీట్లు ఉన్న ఖైదీలు మంచి ప్రవర్తనపై విడుదలవ్వాలని సూచించారు. అలాంటివారికి నైపుణ్యం ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. జైళ్ల శాఖ డీఐజీ ఎంఆర్ రవికిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఈ-ములాఖత్, ఫిజికల్ ఇంటర్వ్యూలను వినియోగించుకుని కుటుంబ సభ్యులతో మంచి సంబంధాలు కొనసాగించుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

ఆశ్రమోన్నత పాఠశాలకు నాసిరకం సరకులు

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు ఈశ్వరరావు



పాఠశాల సిబ్బందికి నాసిరకం కందిపప్పు చూపిస్తున్న ఈశ్వరరావు

మాడుగుల: మండలంలోని ఎల్.పొన్నవోలు పంచాయతీ నరసయ్యపేట, దిబ్బూరు గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలకు సంబంధిత కాంట్రాక్టరు కందిపప్పు, వేరుశనగ తదితర నాసిరకం సరకులు సరఫరా చేస్తున్నారని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు మరువాడ ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన ఆశ్రమోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోడిగుడ్లు నెలకొకసారి సరఫరా చేయడం వల్ల పాడవుతున్నాయని ఆరోపించారు. వీటిని వారానికి ఒకసారి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ తగినంత సిబ్బంది లేకపోవడం వల్ల మరుగుదొడ్లు శుభ్రంగా లేవని, దీనిపై కలెక్టరుకు ఫిర్యాదు చేస్తానన్నారు. పాఠశాలలో 240 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి మేలు రకం సరకులు సరఫరా చేయాలని కోరారు.

మేనల్లుడిని హత్య చేసిన వ్యక్తి అరెస్టు

చోడవరం: మేనల్లుడిని హత్య చేసిన కేసులో మేనమామ బంగారి దుర్గను అరెస్టు చేసినట్టు చోడవరం సీఐ అప్పలరాజు ఆదివారం తెలిపారు. ఈనెల 27వ తేదీన చోడవరం పాత బస్టాండ్ దగ్గర స్థానిక రెల్లివీధికి చెందిన సోమాదుల ప్రేమ్‌కుమార్ అనే యువకుడిని అతని మేనమామ దుర్గ కర్రతో కొట్టి హత్యచేసిన విషయం తెలిసిందే. కేసు విచారణ అనంతరం నిందితుడు దుర్గను అరెస్టు చేసినట్టు సీఐ చెప్పారు. మద్యానికి బానిసై కుటుంబసభ్యులను చిత్ర హింసలకు గురిచేస్తున్నందుకు సహనం కోల్పోవడంతో పాటు చిత్తుకాగితాలు అమ్మకాల లావాదేవీల్లో తగాదా రావడంతోనే మేనల్లుడైన ప్రేమ్‌కుమార్‌ను మేనమామ దుర్గ హత్య చేశాడని తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందని సీఐ అప్పలరాజు చెప్పారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ధాన్యం నిల్వలో జాగ్రత్తలు

- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి
- యాజమాన్య పద్ధతులు అవలంబించాలి
- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

బుచ్చెయ్యపేట: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఇంటికి చేర్చడం ఒక ఎత్తయితే దాన్ని నిల్వ చేసుకోవడం మరో ఎత్తు.. ఆ సమయంలో సరైన యాజమాన్య పద్ధతులు అవలంబించకపోతే ఏడాది పొడవున దాచే ధాన్యం దెబ్బతింటాయి. ఈ నేపథ్యంలో ధాన్యం నిల్వలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచనలు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది లక్షా 50 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేపట్టారు. అన్ని గ్రామాల్లో వరి కోతలు కోసి కుప్పలు పెట్టి నూర్పిడి యంత్రాలు, ట్రాక్టర్లు, ఎడ్ల సహాయంతో జోరుగా కుప్పలు నూర్పుతున్నారు. నూర్పిన ధాన్యాన్ని ఏడాది తిండి గింజలు కోసం, ధర వచ్చినపుడు అమ్ముకోవడానికి నిల్వ చేస్తుంటారు. ఈ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ధాన్యం మొత్తం గింజకట్టి చేనంతా ఎర్రబడిన తర్వాత వరికోతలు చేయాలి.
- నూర్పిన ధాన్యాన్ని 12 శాతం తేమ ఉండే వరకు ఆరబెట్టాలి.
- రసాయన ఎరువులను ధాన్యంపై నేరుగా పిచికారీ చేయకూడదు. ఇలా చేస్తే విష ప్రభావం ఎక్కువగా ఉండి ఆరోగ్యాలు దెబ్బతింటాయి.
- ధాన్యంపై కీటకాలు, పురుగులు ఆశించకుండా వేపాకు, సీతాఫలం గింజలు, వెల్లుల్లి, ఉసిరి గింజలను పొడి చేసి రెండు శాతం వరకు పొడిని ధాన్యంలో కలపాలి.
- ఇలా చేస్తే ఎనిమిది నెలల వరకు ధాన్యంలో పురుగు చేరకుండా ఉంటుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో దొరికే ఉత్తరేణి, కసివింత, ఉమ్మెత్త, మిరప, వేపాకు, కీసర చెట్టు ఆకులను ధాన్యం బస్తాల్లో కలిపి ఉంచిన నాల్గు నెలల వరకు పురుగు చేరదు.



కోత దశకు చేరి ఎర్రబడిన వరి చేను

గోదాముల్లో ధాన్యం నిల్వ ...

- గోదాముల్లో ధాన్యం నిల్వ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- గోదాము నేలపైన, గోడలకుపైన కప్పులకు రంధ్రాలు లేకుండా చూసుకోవాలి.
- తుఫాన్ గాలులకు పై కప్పులు ఎగిరిపోకుండా ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- రంధ్రాలుంటే సిమెంట్‌తో ముందుగా పూడ్చాలి.
- ధాన్యం నిల్వలకు పాత గోనె సంచులను ఎక్కువగా ఉపయోగించరాదు.
- గోనె సంచులను ముందుగా 2 మిల్లీలీటర్లు మలాథియాన్ మందును లీటరు నీటిలో కలిపి పది నిమిషాలు మందు ద్రావణంలో నానబెట్టి ఎండలో ఆరబెట్టాలి.
- గోదాము గోడలకు, నేలపై పురుగు ఆశించకుండా 10 మిల్లీలీటర్లు మలాథియాన్ మందును లేదా 7 మిల్లీలీటర్లు డైక్లోర్‌వాస్ మందును నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- చెక్క బల్లలపై ధాన్యం బస్తాలు వేసుకుంటే తేమ తగలకుండా ఉంటుంది.
- గోడలకు, పై కప్పుకు ధాన్యం బస్తాలు తగలకుండా నిట్ట వేసి, వర్షం నీరు గోదాముల్లోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎక్కువ కాలం ధాన్యం నిల్వ ఉంచకుండా సకాలంలో అమ్ముకుంటే రంగు మారదు. దిగుబడితో పాటు నాణ్యత ఉంటుంది.
- బస్తాలను 1-2 అడుగుల ఎత్తులో బెంచీలు, అరుగుల మీద వేస్తే భూమిపై ఉన్న తేమ లాక్కోదు.

అకాల వర్షాలకు పంట తడిస్తే...

- గాలి వర్షాలకు పండిన పంట నేలకొరిగేతే వెంటనే వరి పంటను నిలబెట్టి కట్టలుగా కట్టాలి.



వరి పంటను నూర్చుతున్న రైతులు

- కోసిన వరి పనలు తడిస్తే ఎండ తగిలేలా తడి ఆరేలా ఆరబెట్టాలి. గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలి.
- వర్షం తగ్గని పరిస్థితుల్లో తడిచిన వరిని కుప్పలు పెడితే వరి పనలపై ఎకరాకు 25 కేజీల ఉప్పును చల్లి కుప్ప పెట్టాలి.
- తడిచిన ధాన్యం ఆరబెట్టడానికి వీలు కాకపోతే మొలకెత్తకుండా క్వింటా ధాన్యానికి కేజీ ఉప్పు, 20 కేజీల పొడి ఊకను కలిపి పోగు పెడితే మొలకెత్త కుండా జాగ్రత్తపడొచ్చు.

మెలకువలు పాటించాలి



ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు సకాలంలో కోసి నూర్చి ధాన్యాన్ని భద్రపరచడంలో మెలకువలు పాటించాలి. పండిన వరి పంటను సకాలంలో కోత కోయాలి. నూర్చిన ధాన్యంలో 14 శాతం కన్నా తక్కువ తేమ ఉండేలా చూసుకోవాలి. ధాన్యాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా సకాలంలో అమ్మకాలు చేయడం, బియ్యం మిల్లుకు ఆడించడం, ఎలుకల సమస్య లేకుండా చూస్తే నష్టాలుండవు.

– భాస్కరరావు, మండల వ్యవసాయాధికారి, బుచ్చెయ్యపేట

వైద్యం అందక మహిళ మృతి



మృతి చెందిన వైద్యాసు లక్ష్మి(ఫైల్)

రోలుగుంట: స్థానిక పీహెచ్‌సీలో సకాలంలో వైద్యం అందక రోలుగుంటకు చెందిన వైదాసు లక్ష్మి(60) మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి 11.30 గంటలకు శ్వాసకోస సమస్యతో బాధపడుతున్న లక్ష్మిని కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. కనీసం ఆస్పత్రి తలుపులు తీయకుండా వైద్యులు లేరంటూ అక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి పంపించేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. వెంటనే నర్సీపట్నం తరలిస్తుండగా లక్ష్మి మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మరణం కేవలం నైట్ డ్యూటీ సిబ్బంది నిర్లక్ష్యంగా కారణంగానే జరిగిందని, సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై వైద్యురాలు కె.ధనలక్ష్మిని సాక్షి సంప్రదించగా తనకు సమాచారం తెలిసిందని, వెంటనే సిబ్బందిని విషయం అడగగా.. తాము తలుపులు తీశామని, మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం తీసుకెళ్లాలని సూచించామని చెప్పారన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదా !

- ఎంపీ శ్రీభరత్ ఆశ్చర్యం
- కంగుతిన్న ప్లాంట్ నేతలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదన్న విషయం తెలిసి ఎంపీ శ్రీభరత్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎంపీ సమాధానానికి స్టీల్‌ప్లాంట్ నాయకులు నివ్వెరపోయారు. జీతాలు చెల్లించని విషయం ఎంపీ దృష్టికి పలుమార్లు స్టీల్‌ప్లాంట్ నాయకులు తీసుకువెళ్లినప్పటికీ పైవిధంగా మాట్లాడడంతో ప్లాంట్ నేతలు కంగుతిన్నారు. ఈ విషయంపై ఉక్కు మంత్రి దృష్టికి తీసుకువెళతానని ఎంపీ హామీ ఇచ్చారు.

హెటెరో కంపెనీ ఔదార్యం

- రూ.5 కోట్లు సీఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి పనులు
- హోం మంత్రి అనిత చేతుల మీదుగా ప్రారంభోత్సవం



తీనార్లలో సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న మంత్రి అనిత

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట సమీపంలో ఉన్న హెటెరో రసాయన పరిశ్రమ యాజమాన్యం మరోసారి తన ఔదార్యాన్ని చాటుకుంది. ఇప్పటికే కోట్లాది రూపాయలతో విద్య, వైద్య విభాగాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న యాజమాన్యం.. తాజాగా కంపెనీ పరిసర ప్రాంతాల్లో ఉన్న పెదతీనార్ల, దొండవాక, రాజయ్యపేట గ్రామాల్లో సుమారు రూ.5 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులు చేపట్టింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఈ అభివృద్ధి పనులను హోం మంత్రి వంగలపూడి అనిత, కంపెనీ సీఎస్‌ఆర్ హెడ్ సుధాకర్, డీజీఎంలు సుబ్బారెడ్డి, కుళ్లాయిరెడ్డి, రాజారెడ్డి, తదితరులు ప్రారంభించారు. మత్స్యకారులు అధికంగా ఉన్న ఈ గ్రామాల్లో హెటెరో కంపెనీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కనీస సదుపాయలు కల్పించారు.

కంపెనీ పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో సురక్షితమైన తాగునీటిని సరఫరా చేసేందుకు ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశామని డీజీఎంలు సుధాకర్, సుబ్బారెడ్డి, కుళ్లాయిరెడ్డి తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల్లో విద్య, వైద్య సమస్యల పరిష్కారానికి కంపెనీ కృషి చేస్తోందన్నారు. నక్కపల్లి ఆస్పత్రిలో ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటుకు అసవరమైన డార్క్ రూమ్‌ను రూ.10 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. మంత్రి అనిత మాట్లాడుతూ కంపెనీ పరిసర ప్రాంత గ్రామాల్లో సీఎస్‌ఆర్ నిధులతో కోట్లాది రూపాయలు వెచ్చింది పలు అభివృద్ధి పనులు, విద్య, వైద్యాభివృద్ధి కోసం కంపెనీ యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. స్థానికులకు కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సర్పంచ్‌లు అప్పలనర్స, శ్రీను, ఏరియా ఆస్పత్రి కమిటీ సభ్యుడు కొప్పిశెట్టి వెంకటేష్, ఎంపీటీసీ మేరుగు నాగేశ్వరరావు, కంపెనీ డీజీఎంలు వీర వెంకటసత్యనారాయణరెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు, నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, తాతారావు, పిక్కి శ్రీను, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఇవీ అభివృద్ధి పనులు

- పెద తీనార్లలో ఆటో స్టాండ్ నుంచి పాఠశాల వరకు, రామాలయం నుంచి బీచ్ వరకు, అమ్మవారి గుడి ముందు మొత్తం కోటి రూపాయలు వెచ్చించి 2200 మీటర్ల దూరం కలిగిన సీసీ రోడ్లు నిర్మించారు.
- దొండవాకలో రూ.1.35 కోట్లతో మత్స్యకారుల సమావేశాలు, వివాహాది శుభకార్యక్రమాల నిర్వహణ కోసం కల్యాణ మండపం నిర్మించారు.
- రాజయ్యపేటలో 4500 మీటర్ల దూరం కలిగిన 15 సీసీ రోడ్లను రూ.2 కోట్లు వెచ్చించి నిర్మించారు.
- రాజయ్యపేటలో 2 వేల కిలోలీటర్ల సామర్థ్యంతో ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు చేశారు.

ఎకరాకు రూ.30 లక్షలు ఇస్తాం ..భూములివ్వండి

బోదిగల్లం రైతులతో మంత్రి అనిత భేటీ



మంత్రితో సమావేశమైన బోదిగల్లం రైతులు

నక్కపల్లి: ఎకరాకు రూ.30 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని కంపెనీల అవసరాల కోసం భూములు ఇవ్వాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు. ఆదివారం బోదిగల్లం రైతులు మంత్రిని ఆమె నివాసంలో కలిసారు. తమ గ్రామంలో భూసేకరణ విషయాన్ని ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చందనాడ, రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, డీఎల్‌పురం, అమలాపురం తదితర గ్రామాల్లో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో పలు కంపెనీలు ఏర్పాటు కానున్నాయని, భూములు ఇచ్చిన రైతులకు ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు బోదిగల్లం రెవెన్యూ పరిధిలో భూసేకరణ చేస్తున్నామన్నారు. ఎకరాకు రూ.30 లక్షలు నష్టపరిహారం చెల్లిస్తామని మీరంతా భూములు ఇచ్చిన ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. దీనిపై రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారం ఏమాత్రం సరిపోదన్నారు. బహిరంగ మార్కెట్లో ధర చాలా ఎక్కువగా ఉందని, ధర పెంచాలని కోరారు. స్థానికంగా ఏర్పాటు చేసే కంపెనీల్లో స్థానికులకు, భూములు ఇచ్చిన రైతులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.30 లక్షల ధర బాగానే ఉందని, ఈ ధరకే భూములు ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నర్సింహమూర్తి, నాయకులు వెంకటేష్, సర్పంచ్ మున్సీసా పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ ఆక్రమించి వరి సాగు

- ఆక్రమణదారులకు కూటమి నేతల మద్దతు
- చర్యలు తీసుకోవాలని చమ్మచింత గ్రామస్తుల డిమాండ్



జగనన్న లేఅవుట్‌లో భూమిని ఆక్రమించుకుని వరి సాగు

నాతవరం: కూటమి నేతల దన్నుతో జగనన్న కాలనీ లేఅవుట్‌ను ఇద్దరు వ్యక్తులు ఆక్రమించుకుని దర్జాగా వ్యవసాయం చేస్తున్నారు. దీనిపై చమ్మచింత సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా మీనమేషాలు లెక్కిస్తున్నారు. మండలంలోని చమ్మచింత పంచాయతీ సర్వే నంబరు 28/1లో మూడెకరాల ప్రభుత్వ భూమిలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేశారు. కొంతమంది ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. మరికొంత మంది ఇంకా ఇళ్లు నిర్మించలేదు. ఇదే అవకాశంగా చేసుకుని ఇద్దరు వ్యక్తులు సుమారు 50 సెంట్లు విస్తీర్ణాన్ని అధికార పార్టీ అండతో ఆక్రమించుకున్నారు. లబ్ధిదారులను బెదిరించి దర్జాగా సాగు చేసుకుంటున్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకోవడంతో భూమికి గిరాకీ..

తాండవ రిజర్వాయరుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని జగనన్న లేఅవుట్ ఉంది. మాధవనగరం పంచాయతీ శివారు గంటావారి కొత్తగూడెం గ్రామాన్ని ఆనుకుని ఉండటంతో ఇక్కడ భూములను గిరాకీ ఉంది. ఇక్కడ ఇళ్ల స్థలాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలకు పట్టాలు పొందిన లబ్ధిదారులు ఆక్రమణదారులపై ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదు. ఈ నెల 27న మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ కొండబాబు, ఉప సర్పంచ్ దివాణం అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంపై చర్యలు చేపట్టాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తహసీల్దార్‌కు సూచించారు. ఆక్రమణదారులు కూటమి పార్టీకి చెందిన వారు కావడంతో రెవెన్యూ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూటడం లేదని సర్పంచ్, ఉప సర్పంచ్ ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ ఏ వేణుగోపాల్ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశంలో తన దృష్టికి వచ్చిందని, క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు.

అలల చెంతన అందెల సవ్వడి



- కనులపండువగా బ్రహ్మాంజలి
- శాస్త్రీయ నృత్య ఘోషతో విశాఖ తీరం పులకింత

ఏయూక్యాంపస్: అలల చెంతన అందెల సవ్వడి విశాఖ వాసులను ఓలలాడించింది. బీచ్‌రోడ్డులోని ఎంజీఎం పార్క్ వేదికగా ఇంటర్నేషనల్ ట్రెడిషనల్ డ్యాన్స్ కాంగ్రెస్-2024లో భాగంగా చివరి రోజు ఆదివారం 1,500 మందికి పైగా కూచిపూడి కళాకారులతో బ్రహ్మాంజలి-మహాబృంద నృత్యం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన కళాకారులు ఒకే వేదికపై పాదం కలిపారు. కూచిపూడిని నాటి నుంచి నేటి వరకు విశ్వవ్యాప్తం చేసిన గురువులందరినీ స్మరించుకుంటూ ఈ నృత్య నివేదన చేశారు. ఈ సందర్భంగా సిద్ధేంద్ర కళాక్షేత్రం పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి మాట్లాడుతూ విశాఖ, కాకినాడ, కూచిపూడి, గుంటూరులో ఇటువంటి బృహత్ కార్యక్రమాలు జరగడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఇది జ్ఞాన అధ్యయనానికి ఉపకరించే కళ అని అన్నారు. బాలురు కూడా కూచిపూడి నృత్యాన్ని అభ్యసించాలని సూచించారు. సంస్కారవంతమైన మార్గంలో చిన్నారులను నడిపించాలని తల్లిదండ్రులను కోరారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ మాట్లాడుతూ కూచిపూడి నృత్యం నేడు విశ్వవ్యాప్తం అయిందన్నారు. కళలు సంస్కృతిని చాటుతాయన్నారు. కూచిపూడి నృత్య గురువు పి.సుధీర్ రావు మాట్లాడుతూ చిన్నారులను కళల దిశగా నడిపించే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. మంచి గురువును ఎంపిక చేసుకుని శ్రద్ధతో నేర్చుకోవాలన్నారు. కళారత్న కె.వి.సత్యనారాయణ మాట్లాడుతూ నగరంలో నిర్వహిస్తున్న మూడు రోజుల వేడుక భారతీయ నృత్య, సాంస్కృతిక వైభవాన్ని చాటిందన్నారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ విశాఖ నగరం ఎంతో పుణ్యం చేసుకుందన్నారు. కార్యక్రమ సంచాలకుడు బత్తిన విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన సందీప్ బృందం పేరిణి నృత్యం, కళాకృతి బృందం కావడి నృత్యం, కళాకృతి బృందం కరగాట్టం నృత్యం, కోల్‌కతాకు చెందిన అనురేఖా బృందం కథక్ నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఒడిశా, ఢిల్లీకి చెందిన కళాకారులు పలు నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విభిన్న ప్రాంతాల నుంచి హాజరైన నాట్య గురువులను వేదికపై సత్కరించి, పురస్కారాలు ప్రదానం చేశారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి

- పెదకలవలాపల్లిలో ఘటన
- మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తుల ఆందోళన



లారీ చక్రాల కింద నలిగిపోయిన చిరంజీవి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాంబిల్లి (యలమంచిలి): పేద కుటుంబంపై విధి వక్రించింది. రెక్కాడితే డొక్కాడని పేద కుటుంబానికి చెందిన ఒక మూగ వ్యక్తిపై లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని నడపడం వల్ల ఒక నిండు ప్రాణం బలైపోయింది. రాంబిల్లి ఎస్‌ఐ నాగేంద్ర తెలిపిన వివరాలివి. రాంబిల్లి మండలం పెదకలవలాపల్లి గ్రామం జగనన్న కాలనీ వద్ద జరుగుతున్న నేవల్‌బేస్ ప్రహరీ నిర్మాణం పనుల్లో భాగంగా ఆదివారం రాత్రి కాంక్రీట్‌ను తరలిస్తున్న లారీ అదే గ్రామానికి చెందిన యలమంచిలి చిరంజీవిపై వేగంగా దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో యలమంచిలి చిరంజీవి (36)లారీ చక్రాల కింద నలిగి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు చిరంజీవికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. చిరంజీవి తన ఇంటి సమీపంలో కూర్చుని ఉండగా అతనిపైకి లారీ దూసుకెళ్లడంతో దుర్మరణం చెందాడు. పెదకలవలాపల్లి గ్రామంలో జగనన్న కాలనీలో ఇరుకురోడ్డులో ప్రజలు సంచరిస్తున్న తరుణంలో అతివేగంగా లారీ యువకుడిపై నుంచి దూసుకెళ్లడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. రాత్రి సమయంలో ప్రజలు అందరూ తిరుగుతున్న సమయంలో ఇలా వేగంగా లారీని నడపడం వల్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడని గ్రామంలో ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కాంట్రాక్టర్‌ని నిలదీశారు. పెదకలవలాపల్లి గ్రామం ఆనుకొని నిర్మిస్తున్న నేవల్‌బేస్ రక్షణ గోడ పనులకు సంబంధించి మెటీరియల్‌ను తరలిస్తున్న లారీలు రోజూ గ్రామంలో మితిమీరిన వేగంతో వెళ్తున్నాయని, వాటి వల్ల ఈ రోజు ఒక నిండు ప్రాణం పోయిందని గ్రామస్తులు, మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అడ్డు అదుపు లేకుండా నిర్లక్ష్యంగా నడుపుతున్న లారీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు.

తీవ్ర జ్వరంతో విద్యార్థిని మృతి



కంఠంరెడ్డి భాగ్యశ్రీ

మునగపాక: తీవ్ర జ్వరంతో బాధపడుతూ మండలంలోని పల్లపు ఆనందపురానికి చెందిన ఒకటో తరగతి విద్యార్థిని భాగ్యశ్రీ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. పల్లపు ఆనందపురానికి చెందిన కంఠంరెడ్డి చిరంజీవి, కుమారి దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె భాగ్యశ్రీ స్థానిక మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. ఈమె కొద్ది రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. చదువులో అందరికన్నా ముందుండేదని, చలాకీగా తిరుగుతూ ఉండే భాగ్యశ్రీ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్



నిందితుడితో పోలీసులు

చోడవరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగను చోడవరం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 10 సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా చోడవరం పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఇటీవల కొంత మంది ప్రయాణికుల సెల్‌ఫోన్లు, జేబుల్లో పర్సులు చోరీకి గురైనట్టు ఫిర్యాదులు అందడంతో నిఘా పెంచామన్నారు. తాజాగా ఓ మహిళ వద్ద ఉన్న డబ్బులతో ఉన్న పర్సు చోరీకి గురైనట్టు ఫిర్యాదు అందడంతో సీసీ కెమెరాలు పరిశీలించామన్నారు. సువార్తరాజు అనే వ్యక్తి ఈ చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించామన్నారు. అతనిని అరెస్టు చేసి సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో ఎస్‌ఐ నాగకార్తీక్, సిబ్బంది ఎంతో కృషి చేశారని సీఐ అభినందించారు.

గొన్నవానిపాలెంలో 30 నాటుకోళ్లు మాయం

బుచ్చెయ్యపేట: మండలంలో గొన్నవానిపాలెం గ్రామంలో 30 నాటుకోళ్లను గుర్తుతెలియని వ్యక్తులు పట్టుకుపోయారు. గ్రామానికి చెందిన వియ్యపు దేముళ్లు, అప్పాలుకు చెందిన నాటుకోళ్లను ఎత్తుకుపోయారు. శనివారం రాత్రి పాకల వద్ద ఉంచిన కోళ్లు ఆదివారం ఉదయానికి మాయం అయ్యాయి. వీటి విలువ రూ.30 వేలు ఉంటుందని బాధితులు లబోదిబోమంటున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. కన్నూరుపాలెం, తీడ, చెరకాం, సుందరయ్యపేట, ఆనందపురం, లాలంకొత్తూరు, జి. భీమవరం, సింగవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరా ఉండబోదని, ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

వడ్డాది పాపయ్య వర్ధంతి నేడు

కశింకోట: వర్ణ సామ్రాజ్యానికి నాలుగు దశాబ్దాల పాటు మకుటంలేని మహారాజుగా వెలుగొంది చిత్ర కళాపిపాసకులను ఓలలాడించిన అద్భుత చిత్రకారుడు వడ్డాది పాపయ్య వర్ధంతిని సోమవారం ఆయన అభిమానులు జరుపుకోనున్నారు. 1921 సెప్టెంబర్ 10న శ్రీకాకుళంలో జన్మించిన పాపయ్య కశింకోటలో స్థిరపడి 1992 డిసెంబర్ 30న తనువు చాలించారు. తండ్రి రామ్మూర్తి నుంచి వారసత్వంగా అబ్బిన చిత్ర కళలో మెలకువలు పాటించి స్వయం కృషితో సాధన చేసి అంచెలంచెలుగా ఎదిగి మహా చిత్రకారుడయ్యారు. తెలుగు చిత్ర కళకు ఉన్న గౌరవాన్ని ఇనుమడింపజేశారు. పత్రికా ప్రపంచానికి వ.పా.గా పరిచితుడైన పాపయ్య స్వాతి, చందమామ, ఆంధ్రజ్యోతి, యువ తదతర వార, మాస పత్రికలకు ముఖ చిత్రాలు గీసి చిత్రకళా ప్రియుల హృదయాలను దోచుకున్నారు. ఆయన చిత్రాల కోసమే కొన్ని పత్రికలు అమ్ముడయ్యేవంటే అతిశయోక్తి కాదు. అటువంటి చిత్రకారుని వర్ధంతిని జరుపుకోవడానికి అభిమానులు సన్నద్ధమవుతున్నారు. కశింకోటలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది మార్చి 14న చిత్ర కళా జగత్తుకు వన్నె తెచ్చిన పాపయ్యను కళాభిమానులు, ప్రజలు ఎల్లకాలం గుర్తుంచుకునే విధంగా ఆయన నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసి అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించారు. తద్వారా ఆయనకు మరింత గుర్తింపు తీసుకు వచినట్లు అయిందని కళాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మోదమాంబకు వెండి ఆభరణాల బహూకరణ


మోదమాంబకు వెండి ఆభరణాలు అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు మోదమాంబ అమ్మవారికి దాతలు వెండి ఆభరణాలు బహూకరించారు. గ్రామానికి చెందిన పట్టాపు రమణబాబు, పట్టాపు కొండలరావు, పట్టాపు వరహామూర్తి, పట్టాపు మాణిక్యం, బైలపూడి వెంకట్రావు కుటుంబ సభ్యులు అరకేజీ వెండితో తయారు చేసిన వెండి ఆభరణాలను ఆదివారం గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	: సత్యనారాయణ స్క్రీన్-2
యూఐ	: పర్తిసాయి
మ్యాక్స్	: షిర్డీసాయి
శ్రీకాకుళం షెర్లాక్ హోమ్	:వెంకటేశ్వర
అమరన్	: శ్రీసత్య
డ్రింకర్ సాయి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 291 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 205 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

పాఠశాలకు.. ఒకే ఒక్కడు


పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

- కన్నూరుపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఒకే ఒక్క విద్యార్థి
- అన్ని సదుపాయాలున్నా ఆసక్తి చూపని విద్యార్థులు, తల్లిదండ్రులు


కన్నూరుపాలెం పాఠశాల


కన్నూరుపాలెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఒకే విద్యార్థి


పాఠశాలలో విశాలమైన మైదానం

కశింకోట: ఆ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థే విద్యనభ్యసిస్తున్నారు. వారికి ఒక్కో ఉపాధ్యాయుడు, ఒక్కో ఆయా, విద్యా నిర్వహణ కమిటీ చైర్మన్, మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు ఉన్నారు. వీరికి సుమారు రూ.50 వేలు పైబడి ఖర్చు చేస్తున్నా ఈ పాఠశాలల్లో చేరడానికి విద్యార్థులు ముందుకు రావడంలేదు. ఇది కశింకోట మండలంలోని నాలుగు పాఠశాలల్లో నెలకొన్న పరిస్థితి. మరో పాఠశాల ఈ ఏడాది విద్యార్థులు లేక మూత పడింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతుండడమే దీనికి కారణమని పలువురు చెబుతున్నారు. దీంతో ఒక విద్యార్థికి ఒకే ఉపాధ్యాయురాలు పాఠాలు బోధించాల్సిన విచిత్ర పరిస్థితి నెలకొంది. మండలంలో 43 ప్రాథమిక పాఠశాలలున్నాయి. 698 మంది విద్యార్థులు చదువుతున్నారు. కన్నూరుపాలెం ప్రాథమిక పాఠశాలలో ఒకే విద్యార్థి చదువుతున్నాడు. అక్కడ సుమారు 3 వేల మంది జనాభా ఉన్నారు. ఇది గతంలో ఆదర్శ పాఠశాలగా నడిచింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం 200 మందికి పైగా విద్యార్థులు ఉండేవారు. ఇప్పుడు ఒక్కరికే పరిమితమైంది. అక్కడ రెండు ప్రైవేటు పాఠశాలలున్నాయి. వాటి లో సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5 తరగతులున్నాయి. అయినప్పటికీ ఒకే విద్యార్థి రెండో తరగతి చదువుతున్నాడు. గత ఏడాది ఇక్కడ ముగ్గురు విద్యార్థులుండేవారు. వారు ఉన్నత తరగతులకు ప్రమోట్ అయ్యారు. దీంతో ఈ ఏడాది కేవలం ఒక విద్యార్థి మాత్రమే రెండో తరగతి చదువుతున్నాడు. ఆ పాఠశాలలో ఒక విద్యార్థికి బోధించడానికి ఒక ఉపాధ్యాయురాలు ఉన్నారు. అంతే కాక రూ.6 వేల వేతనంపై నియమించిన ఆయా ఉంది. మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలికి రూ.3 వేలు వేతనం చెల్లిస్తున్నారు. అనారోగ్యంతో విధులకు రాకపోవడంతో విద్యార్థి తల్లి వంట చేసి పెడుతున్నారు. స్కూలు విద్యా నిర్వహణ కమిటీకి ఆమె చైర్మన్ కూడా. ఇక ఉపాధ్యాయురాలికి రూ.40 వేలు పైగా జీతం చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఇలా రూ.50 వేలు పైబడి ప్రతి నెల వెచ్చిస్తున్నప్పటికీ, తరగతి గదులు, విశాలమైన మైదానం ఉన్నప్పటికీ విద్యార్థులు ఇక్కడ చేరడానికి ముందుకు రాని పరిస్థితి నెలకొంది. విద్యార్థుల తల్లిదండ్రులను ప్రోత్సహించి నచ్చజెప్పినప్పటికీ ఎవరూ తమ పిల్లలను స్కూల్లో చేర్పడానికి ముందుకు రాలేదని, దీంతో ఒకే విద్యార్థితో నెట్టుకు రావసి వస్తుందని అధికారులు అంటున్నారు. ఇక రోడ్డుకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాత కన్నూరుపాలెం, అడ్డాం, బుచ్చియ్యపేట ప్రాథమిక పాఠశాలల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. అక్కడ కూడా ఒక్కొక్క విద్యార్థి, వారికొక ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతున్నారు. ఆయా, మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు, పాఠశాల విద్యా నిర్వహణ కమిటీ చైర్మన్లు ఉన్నారు. ఒక్కొక్క ఉపాధ్యాయునికి రూ.40 వేలు పైగా జీతాలు చెల్లిస్తూ పాఠశాలలను నడిపిస్తున్నారు. ఇక సుందరయ్యపేట శివారు ఆనందపురం పాఠశాలకు అయితే విద్యార్థులు చేరడానికి ముందుకు రాకపోవడంతో ఈ ఏడాది మూత పడింది. ఉపాధ్యాయ పోస్టులు రద్దు కాకుండా వాటిని కొనసాగిస్తున్నారు. మరో పది వరకు స్కూళ్లలో కూడా తక్కువ మంది విద్యార్థులే చదువుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఎంతగా ప్రోత్సహించినా ఎవరూ ముందుకు రాలేదని, తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని ప్రభుత్వం ఈ ఏడాది ఇంకా ఇవ్వకపోవడంతో విద్యార్థులను చేర్పడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదనే విమర్శలున్నాయి. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఏటా క్రమం తప్పకుండా అమ్మ ఒడి కింద ఆర్థిక సహాయం అందించే వారని, వాటితో విద్యార్థులను చదివించే వారమంటున్నా రు. ఇప్పటికైనా తల్లికి వందనం అందించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువగా చేరేలా ప్రోత్సహించి పాఠశాలలను అభివృద్ధి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఒక్క విద్యార్థితోనే కొనసాగిస్తున్నాం..

మండలంలో నాలుగు పాఠశాలల్లో ఒక్కో విద్యార్థే చదువుతున్నారు. తల్లిదండ్రులను ప్రోత్సహించి విద్యార్థులను చేర్చాలని ప్రయత్నించాం. అయితే తల్లిదండ్రులు ముందుకు రాలేదు. దీంతో వారితోనే ప్రభుత్వ నిబంధనల మేరకు కొనసాగిస్తున్నాం. ఆనందపురం పాఠశాలలో విద్యార్థులు ఎవరూ చేరకపోవడంతో మూసివేశాం.
– సురేష్‌కుమార్, ఎంఈవో, కశింకోట.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు


గౌరీపరమేశ్వరుల అమ్మవారిని రథంపై ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని కుంచావారి, విజయరామరాజుపేట గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఆయా ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయ కమిటీ సభ్యులు నేలవేషాలు, స్టేజ్‌ప్రోగ్రాంలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఉత్సవాన్ని తిలకించారు. పట్టణ సీఐలు విజయకుమార్, ఎం.వెంకట నారాయణ ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజలపై అనేక భారాలు మోపుతుందని, విద్యుత్ చార్జీలు, నిత్యావసర సరకుల ధరలు ఇప్పటికే పెరిగిపోయాయని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో అబద్ధపు హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఇప్పుడు మోయలేని భారాలు మోపుతుందన్నారు. మధ్య తరగతి, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలపై చంద్రబాబునాయుడు భారం మోపడం అన్యాయమన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి


మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లి: ప్రభుత్వ బడిని రక్షించుకోవడం, రాజ్యాంగ విలువలు కాపాడుకోవడం ధ్యేయంగా ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలు కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కిషోర్ కుమార్, ఎస్.మురళీ మోహనరావు, రెడ్డి మోహనరావు తెలిపారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 26 నుంచి 31వ తేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రచార యాత్ర పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో మొదలై ఆదివారం రాత్రి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సీఐటీయూ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న క్యాడర్ల, మేనేజ్‌మెంట్లను కలుపుకుని సమైక్య ఆంధ్ర మాత్రమే ఉండాలని కోరుతూ స్థాపించిన ఏకైక సంఘం యూటీఎఫ్ అన్నారు. ప్రభుత్వ బడి ఉండటం ద్వారా రాజ్యాంగ విలువలు కాపాడబడతాయన్నారు. రాజ్యాంగంలో నిర్దేశించినట్లు సమసమాజ స్థాపన లక్ష్యంగా పని చేయాలన్నారు. చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయాల సాధనకు అప్పారి, మైనేని, రామిరెడ్డి లాంటి వ్యక్తులు 15 సంవత్సరాల సర్వీసులు వదులుకుని తమ జీవితాలను అంకితం చేశారని, రూ.50 జీతానికి కూడా నోచుకోని ఉపాధ్యాయులకు ఈ రోజు అన్ని సౌకర్యాలు దక్కేలా యూటీఎఫ్ ఎంతో కృషి చేసిందన్నారు. ప్రభుత్వ విద్యారంగం ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి ఉపాధ్యాయులపై ఉందన్నారు. అంతకు ముందు మహాసభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షుడు పి.వెంకట్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్, ఉపాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శులు జి.ఎస్.ప్రకాష్, శేషుబాబు, రాష్ట్ర కౌన్సిలర్లు ఎల్లయ్యబాబు, ఎంవీ అప్పారావు, పట్టణ, మండల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ


పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న అతిథులు

అనకాపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తమ వంతు సహాయం చేయాలని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. మండలంలో తుమ్మపాల చిన్నబాబు కాలనీలో గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 125 మంది నిరుపేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా గ్రీన్‌క్లబ్ బలహీన వర్గాల ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు జక్కుల నాగేశ్వరరావు, రావూరి అనిత, గ్రంధి రత్నాజీ, బీరా వినోద్‌కుమార్, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, బేతాళం శేషసాయి, వంకాయల ఈశ్వరరావు, రేబాక మధుబాబు, నయిశెట్టి సత్తిబాబు, కర్రి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ మహాసభ నిర్వహణకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న శంకరరావు

అనకాపల్లి: అఖిల భారత రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా 5వ మహాసభ జనవరి 5న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు అన్నారు. స్థానిక దొడ్డిరామునాయుడు భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ హాజరవుతారని ఆయన చెప్పారు. రోడ్డు రవాణా రంగ కార్మికుల సమస్యలపై భారత న్యాయ సంహిత చట్టం, డ్రైవర్లకు కలిగే నష్టాలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. జిల్లాలో ఆటో, మోటార్, వ్యాన్, బస్ డ్రైవర్లు, రోడ్డు రవాణా రంగ కార్మిక సంఘాలు పాల్గొంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోటర్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ జి.దేముడునాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు అడిగర్ల రాజు, మీసం త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి


కలుసుకున్న పెద్ద హైస్కూల్ పూర్వ విద్యార్థులు


విసన్నపేటలో 1992-93 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు


కశింకోటలో 1993-94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

అనకాపల్లి: జీవీఎంసీ మెయిన్‌రోడ్డుపెద్ద హైస్కూల్లో విద్యనభ్యసించిన పదో తరగతి పూర్వ (1992-93) విద్యార్థులు మండలంలో సత్యనారాయణపురం కొండ వద్ద ఆదివారం కలుసుకున్నారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన సుమారు 70 మంది ఒకే చోట చేరి సందడి చేశారు. ఒకరిని ఒకరు పరిచయం చేసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, మధ్యాహ్నం వనభోజనాలు చేశారు. సాయంత్రం హైదరాబాద్, ముంబై, ఢిల్లీ వంటి ప్రాంతాల నుండి వచ్చిన వారు బయలుదేరి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాకి శ్రీనివాస్, పెదిరెడ్ల రమేష్, పెంటకోట సత్యనారాయణ, సతీష్, రామకృష్ణ, రాజేష్, మద్దాల రమణ, అప్పలరాజు, గౌతమ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డీపీఎస్ జెడ్పీ హైస్కూల్లో..

కశింకోట: స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూల్లో చదువుకున్న 1992-93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఆట, పాటలతో ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేసి అంతా కలిసి ఫొటో దిగారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆళ్ల వెంకట అప్పారావు, నంబారు సత్యారావు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, పైలా ప్రసాద్, మళ్ల రాంబాబు, వేగి పాపారావు, మేడిశెట్టి నూకరాజు, దాడి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇదే స్కూలుకి చెందిన 1993-94 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల అపూర్వ కలయిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. ఆట, పాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేశారు. అంతా కలిసి సహ పంక్తి భోజనాలు ఫొటోలు దిగారు. పూర్వ విద్యార్థులు పల్లా లోవరాజు, బుద్దుడు, సత్యనారాయణ, పాలూరి భాస్కరరావు, అత్తిలి కోదండపాణి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వసతి గృహానికి ఫ్యాన్ల వితరణ


బీసీ బాయ్స్ హాస్టల్‌కు సీలింగ్ ఫ్యాన్లు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

తుమ్మపాల: చదువుకున్న సమయంలో తాము ఉన్న వసతి గృహం అభివృద్ధికి ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర హాస్టల్ (1975-85, ఆరు- పది తరగతుల) విద్యార్థులు ఆదివారం ఐదు సీలింగ్ ఫ్యాన్లు అందించారు. మండలంలో సత్యనారాయణపురం సత్యనారాయణ స్వామి కొండపై పూర్వ విద్యార్థుల ఆత్మీయ వనసమారాధన నిర్వహించారు. 40 ఏళ్ల క్రితం చదువుకున్న వీరు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. అప్పటి వార్డెన్ ఎర్రా పాత్రుడు కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం వనసమారాధన అనంతరం పట్టణంలో గల వసతి గృహన్ని పరిశీలించి సౌకర్యాలపై విద్యార్థులతో మాట్లాడారు. సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తామని, దోమల బెడద లేకుండా కిటికీలకు మెష్ ఏర్పాటు చేస్తామని, ఇక నుంచి హాస్టల్‌ను దత్తత తీసుకుని అభివృద్ధికి పాటు పడతామని విద్యార్థులకు, హాస్టల్ వార్డెన్ సత్యనారాయణకు పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం


గాంధీనగరం నుంచి సైకిల్‌పై కొండకర్ల ఆవ వెళ్తున్న యోగా లైఫ్ సభ్యులు

అనకాపల్లి: నిత్యం వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ డాక్టర్ జి.రామ్మూర్తి అన్నారు. వ్యవస్థాపకుడు కరణం బాబూరావు ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగరం నుంచి అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవకు 25 మంది యోగ సాధకులు ఆదివారం సైకిల్ యాత్రగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల శరీరంలో అన్ని భాగాలకు రక్తప్రసరణ జరుగుతుందన్నారు. గతంలో ఎక్కడికి వెళ్లాలన్న సైకిల్‌పై వెళ్లేవారని, మారుతున్న కాలానికి అనుగుణంగా వాహనాల్లో వెళ్తున్నారని తెలిపారు. అనకాపల్లి నుంచి కొండకర్ల ఆవకు సుమారు 30 కిలోమీటర్లు సైకిల్‌పై వెళ్లి, మరలా తిరిగా రావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగా లైఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

అచ్యుతాపురం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిసెట్టి వెంకట అప్పారావు కోరారు. ఈ మేరకు అచ్యుతాపురం ఆదివారం జన విజ్ఞాన వేదిక, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. 2025 నూతన సంవత్సరాన్ని మంచిగా ప్రారంభించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురైతే కుటుంబం ఎంత నష్టపోతుందో అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, జన విజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.

రహదారిపై నిలిచిపోయిన కంటైనర్ లారీ


బ్రేకులు ఫెయిలై నిలిచిపోయిన కంటైనర్ లారీ

కశింకోట: కశింకోట కూడలి వద్ద కంటైనర్ లారీ బ్రేకులు ఫెయిలై నిలిచిపోవడంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న కంటైనర్ కశింకోట వద్దకు వచ్చేసరికి బ్రేక్‌లు ఫెయిలయ్యాయి. డ్రైవర్ విశ్వప్రయత్నం చేసి రోడ్డుపై లారీని నిలిపివేశాడు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. లారీ ముందు భాగం దెబ్బతింది. సీఐ అల్లు స్వామినాయుడు పర్యవేక్షణలో రెండు క్రేన్లు తీసుకొచ్చి వాటి సహాయంతో ఆగిపోయిన కంటైనర్‌ను ఆర్టీసీ బస్ స్టేషన్ వద్దకు తరలించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో జరిగిన సంఘటన వల్ల రాత్రి 7 గంటలు దాటే వరకు రాకపోకలకు అంతరాయం కలుగుతూనే ఉంది.

పుణ్య కోటి వాహనంపై పురుషోత్తముడు


పుణ్యకోటి వాహనంపై స్వామివారిని తిరువీధి సేవలకు తీసుకెళ్తున్న అర్చకులు

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి తిరువీధి సేవలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యార్చనలు, పూజలు నిర్వహించారు. కొండ దిగువన ఉత్సవ మూర్తులకు, క్షేత్ర పాలకుడు వేణుగోపాల స్వామికి, గోదాదేవి అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారిని పుణ్య కోటి వాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తీరు వీధి సేవలు జరిపారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై పాశురంతో నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. తదుపరి తీర్థ గోష్ఠి, ప్రసాద వితరణ జరిగింది. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. ఈ సేవల్లో ప్రధానార్చకులు వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, సాయి ఆచార్యులు పాల్గొన్నారు.

వేడుకగా వన భోజనాలు


విద్యార్థికి గౌరీమాత చిత్రపటం అందజేస్తున్న మాజీ ఎంపీ బీవీ సత్యవతి తదితరులు


సత్యనారాయణపురం కొండపై పరశురామ బ్రాహ్మణ సేవా సంఘం వన సమారాధన

అనకాపల్లి: స్థానిక రింగ్ రోడ్డు ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో గవర సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గవర కులస్తులు ఐక్యంగా ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. ప్రతి ఏడాది ఐదు నుంచి 10 సీట్లు ఇంజినీరింగ్ తదితర రంగాల్లో ఉచితంగా ఇవ్వడమే కాకుండా వారి అభివృద్ధికి కృషి చేయనున్నట్లు డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. అంతకు ముందు గౌరీ మాత విగ్రహానికి గవర కులస్తులు పూలమాలలు వేసి పూజించారు. వన సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వధూవరుల పరిచయ వేదిక, మహిళలు, పురుషులు, చిన్న పిల్లలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్కాలర్ షిప్‌ల అందజేత వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొణతాల చంద్రశేఖర్, కార్యదర్శి మళ్ల జగన్‌మోహన్, కోశాధికారి పిళ్లా త్రినాథ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్, సంఘం సభ్యులు, గవర కులస్తులు పాల్గొన్నారు.

పరశురామ బ్రాహ్మణ వన సమారాధన..

మండలంలో సత్యనారాయణపురం కొండ వద్ద నియోజకవర్గ బ్రాహ్మణ వనసమారాధన కార్యక్రమం జరిగింది. బ్రాహ్మణులు కుటుంబ సమేతంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరశురామ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పేరూరి భోగలింగేశ్వరశర్మ, కార్యదర్శి పొందూరు సూర్యనారాయణశాస్త్రి, కోశాధికారి తనికెళ్ల రామకృష్ణ శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

మండలంలో సత్యనారాయణపురం కొండ వద్ద మామిడి తోటలో అనకాపల్లి ఏరియా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సూరంపూడి రాఘురామయ్య, కార్యదర్శి చింతల అప్పలరాజు, కోశాధికారి కె.వి.రమణమూర్తి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.